# మనోరంజని

చెరుకూరి కమలామణి

ట్రెయిన్ ఆగింది.

ఇక్కడ ట్రెయిన్ ఎక్కువ సేపు ఆగదు. హడావిడిగా, నా కోసం రిజర్వ్ చేయబడిన బెర్త్ వెదుకుకొని, సామాను పెట్టించుకొని, కూలీకి డబ్బు ఇచ్చేసరికి ట్రెయిన్ కదలనే కదిలింది.

నా సీట్లో కూర్చుని, కంపార్ట్‌మెంట్‌లో ఇంకా ఎవరెవరున్నారో అని చూశాను.

నా కెదురుగా నలభై ఏళ్ళు దాటినట్లు కనపడుతున్న ఒక మిలిటరీ ఆఫీసర్, ఆయన భార్య ఉన్నారు. నేను ఎన్. సి. సి. లో పని చేస్తున్నాను. అందుచేత, మిలిటరీ ఆఫీసర్ భుజంమీది చిహ్నాలను బట్టి మేజర్ హోదాలో ఉన్నాడని గ్రహించాను.

మనిషి ముఖంలో ప్రసన్నత, మంచితనం కనపడుతున్నాయి. చూడగానే మనిషి మీద సద్భావం కలుగుతుంది. పంజాబీలాగ కనిపించాడు.

ఆవిడ వైపు చూశాను.

గోపురంలాగా జుట్టు ముడి వేసుకొన్నది. చెవులకు గాజులంతేసి రింగులు పెట్టింది. జుట్టును క్రిందికి, నుదురంతా కప్పేటట్లుగా దువ్వుకొంది. అలంకరణ వలన ఆవిడ ముఖంలో వికారం ఎక్కువయింది!

ఎందుకో ఆవిడ ముఖం ధుమధుమలాడుతున్నది. అసలు ధుమధుమలాడే ముఖం పెట్టటం అలవాటయినట్లున్నది.

నవ్వు వచ్చింది నాకు. నవ్వును బిగబట్టి తల పక్కకు తిప్పాను.

ఉలికిపడ్డాను. నా పక్కగా ముప్పై ఏండ్లలోపు వయసున్న ఒక అబ్బాయి కూర్చుని ఉన్నాడు.

నేను ఉలికిపడింది, ఆ అబ్బాయి కూర్చున్నందుకు కాదు; ఆ అబ్బాయి చూపుకు.

కళ్ళు పెద్దవిచేసి విభ్రాంతిగా నన్నే చూస్తున్నాడు, సభ్యతకూడా మరిచి.

నాకు నలభై మూడవ ఏడు. వికారిని కాను కాని, పెద్ద రూపసినీ కాను. ఇతరుం



నాకర్షించే ప్రత్యేకత నాలో ఉన్నట్లుగా ఎవరూ చెప్పలేదు. అయితే, నలభై రెండేళ్ళ వయసున్నట్లు కనపడను.

ఈవేళ నా కంటే పది, పన్నెండేళ్ళు చిన్నవాడయిన ఈ అబ్బాయి నన్ను కన్నార్పకుండా చూస్తూ ఉన్నాడంటే, నాలో ఏదో ఒక ఆకర్షణ ఉండితీరాలి మరి.

నాకు గర్వం కలిగింది. అప్రయత్నంగా అతని వైపు తదేకంగా చూశాను.

నే నావిధంగా చూసేసరికి ఆ అబ్బాయి కొంచెం కంగారుపడినట్లు కనిపించాడు.

“ఎక్కడిదాకా వెడుతున్నారు, మేడమ్?” మేజర్ మందహాసంతో పలకరించాడు.

చెప్పాను.

“తెల్లవారి ఆరు గంటల ప్రాంతంలో చేరవచ్చు!” అన్నాడు మేజర్.

అవునని తల ఊపాను.

“మీరుకూడా ఆంధ్రులేనా?” అన్నాడు.

“‘మీరు కూడా’ అని అంటే అర్థం?” అని అడిగాను మేజర్‌ని.

“మిస్టర్ రావుకూడా ఆంధ్రులే!” నా పక్కన ఉన్న అబ్బాయి వైపు చూసి స్నేహపూర్వకంగా నవ్వాడు మేజర్.

పలకరింపుగా నా వైపు చూసి నవ్వాడా అబ్బాయి. మెరుస్తున్న కళ్లతో ఇంకా నా వైపే చూస్తున్నాడు.

“మీ చీర బహు చక్కగా ఉంది, మేడమ్! అట్లాంటి చీరలు మా వైపు రావు— ఎంతసేపూ టెరిలిన్లూ, నైలెక్సులూ తప్ప!” తన్మయత్వంతో చీరవైపు చూస్తూ అన్నాడు మేజర్.

నవ్వి, చీర అంచును అప్రయత్నంగా వేళ్లతో సవరించాను.

ఆకాశనీలం రంగు వెంకటగిరి జరీ చీర. చీరనిండా చిన్న చిన్న జరీపువ్వులు. పైటకొంగున అర్ధ గజం మేర పెద్ద జరీపువ్వులు.

నక్షత్రాలు పొదిగిన నీలి గగనంలాగా మెరిసిపోతూంది చీర.

మేజర్ భార్య ముఖంలో రంగులు మారిపోతున్నాయి. ఆవిడ భాషలో (పంజాబీ కామోసు) ఏదో గొణిగింది.

మేజర్ నిర్లక్ష్యంగా నవ్వాడు.

ఆఅబ్బాయికూడా నవ్వాడు. ఎందుకో?

బుట్టలోనుండి ప్రభ తీసి, పేజీలు తిప్పాను.

“కథల పోటీ” అని ఉంది. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలిట.

పిచ్చి కాకపోతే ఏమిటి? అందరి జీవితాలూ ఒకలాగే ఉంటాయి! భాషలు వేరేకాని, జీవితానికి సంబంధించిన కథలు అందరివీ ఒకలాగే ఉంటాయి! నా కెదురుగా ఉన్న మేజర్ భార్యే ఒక ఉదాహరణ. ఆయన నా చీరను మెచ్చుకొనే సరికి ఎంత ఉక్రోషపడుతున్నదో! అందరు ఆడవాళ్లలాగే, ఆవిడా భర్త మీద కాపలా కాస్తున్నది! ఈ కాస్త సేపట్లో ఆయనను ఎగరేసుకుపోతా నన్నట్లే చికాకు పడుతున్నది!

ట్రెయిన్‌లో ఉన్న ఈ కాస్త సేపూ పాటి ఆడదానితో సరదాగా మాట్లాడు దామన్న భావం ఆవిడకి కలగటం లేదు.

విసుగ్గా ఆ అబ్బాయి వైపు చూశాను.

ఆ అబ్బాయి నన్నే చూస్తున్నాడు! కళ్లలో ఏదో తన్మయత్వం కనపడుతున్నది!

నా మనసు పులకించింది! ఒక విధమైన తృప్తి కలిగింది నాకు.

ఇంతవరకూ నా జీవితంలో హృదయాన్ని స్పందింపచేసే మధుర ఘట్టాలేమీ జరగలేదు. కనీసం ఒక ప్రేమలేఖ కూడా రాలేదు నాకు!

ఈ విషయం ఇంతవరకు నా కెప్పుడూ స్ఫురించలేదు. ఈ అబ్బాయి నా వైపు ఇంతగా చూస్తూ ఉంటే, ఈ వేళ గుర్తుకు వస్తున్నది.

అరే! మనసు అప్సరస లాంటిది!

ఈ అబ్బాయి చూపులకు మనసు పులకించిందంటే అర్థం శరీరానికే వార్ధక్యంగాని, మనస్సుకు కాదని! మనస్సు నిత్యయౌవని!

పిచ్చివాడు! నా చేత ఆకర్షింపబడట మేమిటి?

వెన్నెలలాగా మనసంతా ఆనంద తరంగం వ్యాపించింది.

నా చిన్న ట్రాన్సిస్టర్ మీట నొక్కాను.

‘మరిచిపోవబోకే బాలా, మరిచిపోవకే!’ పాట వస్తున్నది.

ఇంకా కొన్ని గంటలు మాత్రమే కలిసి ప్రయాణిస్తాము. ఆ తరవాత ఎవరి కెవరో!

‘మనసున ఊయల లూగెడి, మమతా, ఇక నిద్దురపో!’ అన్న పాట గొంతుకలో కదలాడింది.

మేజర్ గట్టిగా ఆవలించి పై బెర్తు మీది కెక్కి పడుకొన్నాడు.

ఆయన భార్య— “మీకు లైట్ కావాలా?” అని మర్యాదగానే ఇంగ్లీష్‌లో అడిగింది నన్ను.

అక్కరలేదని చెప్పాను.

ఆ అబ్బాయినికూడా అడిగింది. అభ్యంతరం ఏమీ లేదని చెప్పాడు.

నైట్ బల్బ్ వేసి, ఆవిడా పడుకొన్నది.


ఆకాశంనుండి దేవతలు భూదేవికి పాలు పోస్తున్నారు!

మత్తుమందులాంటి వెన్నెల! పక్కన నా వైపు అదో విధంగా చూచే అబ్బాయి!

అతి రమ్యమైన సన్నివేశం! ఎడారి లాంటి జీవితంలో ఇలాంటి ఒయాసిస్సులు ఉండి తీరాలి!

జీవితంలో ముందడుగు వేస్తూ, వెనకకు తిరిగి చూసుకున్నప్పుడు ఇటువంటి సంఘటన ఒకటికూడా స్ఫురించక పోతే, ఆ బ్రతుకు నిరర్థకం!

“నేను మీ బెర్తుమీదే మరి కొంచెం సేపు ఉండవచ్చా?” అని అడిగాడు ఆ అబ్బాయి నన్ను.



## తిరుచెందూర్ దేవాలయం

సుబ్రహ్మణ్యస్వామికి ముఖ్య గృహములుగా చెప్పబడు ఆరు గృహములలో రెండవ గృహం తిరుచెందూర్ ఆలయం.

ఈ ఆరు గృహములూ సుబ్రహ్మణ్య స్వామికి ముఖ్య స్థలములు: పళని, తిరుచెందూర్, తిరుప్పరం కుండ్రం, పళముదిర్‌చోలై, స్వామి మలై, తిరుత్తణి.

ఈ తిరుచెందూర్ ఆలయం అసురుని చంపడానికి యుద్ధం చేసిన స్థలం. శక్తి కుమారస్వామికి ఇచ్చిన వేలాయుధం ప్రభావం వల్ల ఆ రాక్షసుని ఇక్కడే సంహరించడం జరిగింది.

దీపావళి తరవాత (ఆ రాక్షసుని చంపిన రోజే దీపావళి పండుగ) ఈ ఆరు రోజులూ కందషష్ఠి ఉత్సవ రోజులు.

ఈ స్థలం ఉత్తర దిక్కున తూత్తుకుడికి సమీపంలో సుమారు 30 మైళ్ల దూరంలో సముద్రతీరమున ఉన్నది. ఇది మిక్కిలి చరిత్ర ప్రసిద్ధి గన్న ప్రదేశం! ★

రచన, ఫోటో:
**కె. గజేంద్రన్**

అభ్యంతరం లేదన్నాను.

నా ఆంధ్రప్రభ తీసుకొని పేజీలు తిప్పాను.

పది నిమిషాల తరవాత ఆ అబ్బాయి దుస్తులు మార్చుకొని వచ్చి, "గుడ్ నైట్!" అంటూ తన బెర్త్ మీదికి ఎక్కిపోయాడు.

నేనుకూడా పడుకొన్నాను.

ఏవేవో కలలు. హఠాత్తుగా ఎందుకో మెలకువ వచ్చింది. కళ్ళు విప్పి చూశాను.

నా తల దగ్గరగా ఆ అబ్బాయి నిలబడి ఉన్నాడు.

లేచి కూర్చున్నాను. ఆ అబ్బాయి "గుడ్ మార్నింగ్!" అంటూ నా పక్కనే కూర్చున్నాడు.

టైమ్ చూశాను. అయిదూ పది హైంది.

ఇంకో అరగంటలో దిగిపోతాను.

మనస్సులో ఏదో దిగులు!

పళ్ళు తోముకుని వచ్చి, తల దువ్వుకోవడానికి జడ విప్పాను. తలలో నిన్న పెట్టినమనోరంజని పూలదండనుకిటికీలో నుండి బయటికి విసిరివేశాను.

నా జుట్టు ఎంతో పొడవైనది. ఆ అబ్బాయి ముందు జుట్టు విప్పుతూ ఉంటే నా కెంతో సంతోషం కలిగింది.

మేజర్ మేలుకొని ఉంటే, నా జుట్టునుకూడా ఎంతో మెచ్చుకొనేవాడు.

జడ వేసుకొని, బుట్టలోనుండి తడి గుడ్డలో చుట్టిన మనోరంజని పూలదండను తీశాను, తలలో పెట్టుకొందామని.

"ప్లీజ్, మేడమ్ ఒక్క క్షణం ఆగండి."

ఆ అబ్బాయి గొంతులో ఎంత ఆత్రత! ఆశ్చర్యంగా చూశాను.

"ఏమనుకోకండి, మేడమ్. నే నొక టడుగుతాను, ఇస్తారా?"

నర్మగర్భంగా మాట్లాడుతున్నట్లు కనపడలేదే! అబ్బాయి గొంతులో ఆత్రత తప్ప, నే నాశించిన భావం కనపడదేమిటి?

"ఏం కావాలి మీకు?" అన్నాను మామూలు గొంతుకతోనే.

'నువ్వు కావాలి! నీ తీయని మనసు కావాలి!' అని అంటాడా?

మిగిలి ఉన్న పదిహేను నిమిషాల్లో నేను జీవితాంతం గుర్తు ఉంచుకొనే ఆ మాటలు అంటాడా?

"మీరు పెద్దవారు, మేడమ్! అన్యథా భావించకండి!"

బయట చీకటి కరిగిపోతున్నది.

"కోప్పడకండి! నాకు కొత్తగా పెళ్ళయింది. మొదటిమారు మా అత్తగారింటికి పోతున్నాను. నాకు, నా భార్యకుకూడా ఈ మనోరంజనిపూలంటే ప్రాణం! నేను తెచ్చే పట్టుచీరకంటే, మీ మనోరంజని పూలు ఆవిడకు ఎక్కువ ఇష్టమవుతాయి! దయచేసి ఆ దండ నా కివ్వగలరా? మీరు ఈ కంపార్ట్ మెంట్‌లో అడుగు పెట్టినప్పటినుండీ నా మనసు మీ తలలోని మనోరంజని పూలచుట్టూ తిరుగుతున్నది! ప్లీజ్! ఆ దండ నా కివ్వండి!"

భార్యమీదికంటే పూలమీదే ఎక్కువ అనురాగం ఉన్నట్లుంది!

మంచుతెరలు కరిగిపోతున్నాయి. ప్రకృతి స్పష్టంగా కనిపించుతున్నది.

మానవ ప్రకృతికూడా స్పష్టంగా కనపడుతున్నది.

ఈ అబ్బాయిని ఆకర్షించింది నేను కాదు, నా తలలోని పూలు! అతని మనసు నా చుట్టూ కాదు, నా తలలోని పూల చుట్టూ పరిభ్రమించింది!

అద్దంలాంటి నా మనసు మీద పడిన ధూళి చెరిగింది. కళ్లకు కమ్మిన రంగు పొరలు మాయమయ్యాయి.

"ఈ పూలదండ లాగే, మీ దాంపత్య జీవితంకూడా సువాసనలు వెదజల్లుతూ మధురంగా ఉండాలి!" నవ్వుతూ పూలదండ అతని చేతిలో పెట్టాను.

ఆ అబ్బాయి కళ్లలో మెరిసిన మెరుపు చాలు నాకు! ★

# మార్గదర్శులు




## న్యూజీలెండు చేరిన యూరపియనులు

మొట్టమొదట న్యూజీలెండు చేరుకొన్న యూరపియనులు డచ్చి కాప్టెన్ ఎబెల్ టాస్మన్, అతడి సిబ్బంది.

ముప్ఫయ్యవ పడిలో ఉన్న టాస్మన్‌ను డచ్చి ఈస్ట్ ఇండీస్ గవర్నరు ఆంథోనీ వాన్‌డైమెన్ వాణిజ్యాభివృద్ధికిగాను కొత్త దేశాలు అన్వేషించే నిమిత్తం పంపాడు. స్పానిష్ వారినుంచి వాణిజ్యం చేజిక్కించుకొనడానికి చిలీకి మార్గం కనుగొనాలనికూడా టాస్మన్‌ను అతడు ఆదేశించాడు.

టాస్మన్ 1642 ఆగస్టులో రెండు చిన్న నౌకలలో, 110 మంది నౌకా సిబ్బందితో బటేవియా నుంచి (ఇండొనీషియా లోని ఇప్పటి జకాతా) బయలుదేరాడు. వారు పశ్చిమంగా హిందూ మహాసముద్రంలో మారిషస్‌కు వెళ్ళి, అక్కడినుంచి అంతవరకు అజ్ఞాతంగా ఉన్న మార్గాల ననుసరించి పయనం సాగించారు. భూమి కనుపించింది. టాస్మన్ దానికి వాన్‌డైమెన్స్ లాండ్ అని పేరు పెట్టాడు. దానిని టాస్మానియాగా మనం పేర్కొంటున్నాము.

టాస్మన్ ప్రభృతులు తూర్పు దిశగా యానం సాగించి 1642 డిసెంబరు 13 న న్యూజీలెండు సౌత్ ఐలెండు చేరారు.

అక్కడ టాస్మన్ నావికులు నలుగురిని మావోరీలు వధించారు.

ఆ తరవాత టాస్మన్ ఈశాన్యంగా పయనం సాగించి టాంగా చేరి, ఆ దీవులకు ఫ్రెండ్లీ ఐల్స్ అని పేరు పెట్టాడు. టాస్మన్ ప్రభృతులు 1643 జూన్‌లో బటేవియా తిరిగి చేరారు. మంచి వాణిజ్య కేంద్రాలు కనుగొనలేదన్న విమర్శకు గురి అయ్యారుకూడా!